# పొగమంచు

చుట్టూ చీకటి... కటిక చీకటి... ఆకాశంనిండా మబ్బులు కమ్ముకుని వున్నాయి. నల్లని దట్టమైన మబ్బులు... ఇప్పుడో మరి కాస్సేపటిలోనో కుంభవృష్టి ప్రారంభం కాబోతున్నది.

వరుసగా మూడుమెట్లూ ఎక్కి వరండాలో గుమ్మం దగ్గరకొన్ని క్షణాలు నిశ్శబ్దంగా నిలబడ్డాను. తర్వాత తాళం చెవుల గుత్తిలో తాళంచెవి ఏరుకుని తలుపు తీశాను. కొత్తయింటి వాసన... గోడలకు కొత్తగా సున్నంకొట్టిన వాసన.

లోపల చీకటి... ఇన్ని యేళ్ళనుంచీ నా మనసులో పేరుకొని ఘనీభవించిపోయిన ఒంటరితనంలాంటి చీకటి... స్విచ్ వేస్తే లైటు వెలగలేదు. కరెంటు లేదేమో!

తడువుకుంటూ వెళ్ళి కుర్చీలో కూలబడ్డాను... అంతలోనే పక్క కిటికి తలుపులమీద జల్లుపడుతున్న సవ్వడి... ఆ జల్లులో తడుస్తూ ఏదో పక్షి చప్పుడు చేస్తున్నది.

అకస్మాత్తుగా అంతకుముందే జరిగిన సంభాషణ గుర్తు వచ్చింది. మనసంతా ఏదో అలజడి... ఇప్పటి ఆకాశంలాగే మనసంతా వ్యాకులంగా ఉంది. దట్టంగా పేరులేని చెట్టూచేమలూ లతలూ అడ్డదిడ్డంగా పెరిగిపోయి సూర్యకిరణం లెక్కకు ఒక్కటి కూడా చొరరాని అరణ్యంలాటి మనసు... ఇన్నేళ్ళుగా ఈ మనసనే పదార్థాన్ని గడ్డ కట్టించేసి, పనికిరాని రాయిలాచేసి యాంత్రికంగా నడిపిన జీవితం... పగలల్లా ఉద్యోగం... నిద్రలేని రాత్రులు... నిద్ర మాత్రలు...

వాన బాగా పెద్దదైనట్టుంది... ఉన్నట్టుండి లైటు వెలిగింది. కుర్చీలోనుంచి లేచి కొన్ని క్షణాలు అటూయిటూ పచార్లు చేశాను. తర్వాతవెళ్ళి అలమారుతీసి చూస్తే నిద్రమాత్రల సీసా ఖాళీ... విసుగుతో ఖాళీసీసాను విసిరికొట్టాను. మళ్ళీ కుర్చీలో కూలబడి చొక్కా చేతులు మడతపెట్టుకున్నాను. బయట వర్షం నిలిచి జోరుగా ధారగా కురుస్తున్న సవ్వడి...

అంతలో ప్రభాకరరావు మాటలు గుర్తుకు వచ్చాయి. మాట్లాడేటప్పుడు అతని ముఖ కవళికలు గుర్తుకువచ్చాయి. అతని కళ్ళలో ఉండి ఉండి నీళ్ళు నిలవడం గుర్తువచ్చింది. గంట క్రిందట జరిగిన వృత్తాంతం మబ్బులేని పిడుగులా వుంది.

ప్రభాకరరావు క్లబ్బులో నన్ను కలుసుకుని 'ఒక్కసారి మా యింటికి రండి విశ్వంగారూ!' అనడంతోనే, నాకెలాగూ ఈ కొత్తవూళ్ళో సాయంకాలం గడవటం సమస్యకాబట్టి, ఏమీ అభ్యంతరం చెప్పకుండా అతనివెంట వెళ్ళాను. ప్రభాకరరావు యాభయ్యోపడిలో పడ్డాడు. దృఢంగా, బలంగా వుంటాడు. మర్యాదగా స్నేహంగా మాట్లాడుతాడు. ఇద్దరమూ ఎదురెదురుగా కుర్చీల్లో కూర్చుని చాలాసేపు ఏవేవో విషయాలు మాట్లాడుకున్నాము. అతడు మాట్లాడుతూవుంటే నేను అప్పుడప్పుడు మాటలు కలుపుతూ కూర్చున్నాను. అతని కుర్చీ వెనకనే గోడ మీద ఒక చిన్న పాతకాలపు ఫోటో వ్రేలాడుతున్నది. అప్పుడు నేను లేచాను. లేచి అటూ యిటూ తిరుగుతున్న వాడినల్లా ఆ ఫోటో దగ్గరకి వెళ్ళాను. ఆ ఫోటోను దగ్గరినుంచి చూశాను. చూడగానే నా కళ్ళు మెరిసి వుండాలి.

ప్రభాకరరావు అప్పుడు వెనుదిరిగి చూసి 'ఒహో! ఆ ఫోటో చూస్తున్నారా?' అంటూ లేచి వచ్చాడు. నేనేమీ మాట్లాడలేదు. అప్పుడతడు ఆ ఫోటో చేతిలోకి తీసుకుని చాలా గంభీరంగా మారిపోయి "నేనొక మనిషి కోసం వెదుకుతున్నానండీ... చాలా ఏళ్ళ నుంచీ వెదుకుతున్నాను" అన్నాడు. బయట మబ్బులు... నల్లని మబ్బులు గుమిగూడి వున్నాయి. నేను మళ్ళీ తిరిగివచ్చి కుర్చీలో కూర్చున్నాను. 'ఎవరామనిషి?' అని అడిగాను. అతడు నిట్టూర్చి ముందుకు నడుస్తూ 'ఏమో తెలీదు. అతని పేరు తెలీదు. ఊరూ తెలీదు. కాని వెదుకుతున్నాను' అన్నాడు. ఇప్పుడు బయట ఆకాశంలో మబ్బులు గుంపులు గుంపులుగా చేరి గర్జించడం వినిపిస్తున్నది. నేనిప్పుడూ ఏమీ మాట్లాడలేదు. అతడే మళ్ళీ కుర్చీలో కూర్చుంటూ –

'ఆ మనిషిని గురించి ఏమి తెలీదు. అసలు పేరేమిటో కూడా తెలీదు. ఒక్క వివరం తప్ప...' అన్నాడు.

నేను ముందుకు వంగి 'ఇంతకీ... ఆ మనిషి కోసం ఎందుకు వెదుకుతున్నారు?' అని అడిగాను.

అతని కళ్ళలో చిత్రమైన కసి కనిపించింది. ఏదో గొణుక్కున్నాడు. తర్వాత తాపీగా సిగిరెట్టు వెలిగించుకుని "ఆ మనిషి దొరికితే చంపెయ్యాలి..." అన్నాడు. బయట మబ్బులు గొప్ప యుద్ధానికి సన్నద్ధమై వున్న పెద్ద సైన్యంలా వున్నాయి. ఆ నల్లని మబ్బుల వెనక గొప్ప కోలాహలం...

ప్రభాకరరావు మాటలువిని నేను ఉలిక్కిపడ్డాను. అతడు మళ్ళీ కుర్చీలో సర్దుకుని కూర్చుంటూ 'అవును... దొరికితే వాణ్ణి చంపెయ్యాలి...' అన్నాడు. అంతలోనే అతని కళ్ళలో నీటి పొరకమ్మడం నేను గమనించాను. అది నా కళ్ళ బడకుండా మొహం త్రిప్పుకున్నాడు. 'ఆ మనిషిని గురించి ఒక్క వివరం మాత్రం తెలుసు... అతని మోచేతి పై భాగంలో జీడిగింజంత మచ్చ... పుట్టుమచ్చ...ఉంటుంది. ఏ చేతికో తెలీదు' ఈ మాటలంటున్నప్పుడే అతని కళ్ళనిండా నీళ్ళు నిలిచాయి. అంతలో మళ్ళీ నెమ్మదిగా 'ఇంత జీవితం గడిచిపోయింది. ఆ మనిషిని కలుసుకోకుండానే గడిచిపోయింది. అయినా ఎలా చెప్పండి... యెలా కలుసుకుంటాను? రోజూ యింతమందితో వ్యవహరిస్తున్నాను. ఇంత ప్రపంచంలో, ఇంతమంది మనుషులలో ఆ మనిషిని ఎలా గుర్తుపట్టగలను? ఎంతమంది చేతులు పరీక్ష చేయను? ఎవరి చేతులని పరీక్ష చేయగలను? ఆ పుట్టుమచ్చ వున్నవాడెవరో ఎలా తెలుస్తుంది?' అంటూ గొంతు రుద్ధంకావడంవల్ల ఆగిపోయాడు.

నేను మాటా పలుకూ లేకుండా యెదురుగా కిటికీలోనుంచి కనిపిస్తున్న మబ్బులవంక చూస్తూ కూర్చుండిపోయాను. మళ్ళీ అతడు మొహం పక్కకు త్రిప్పుకుని కళ్ళు తుడుచుకున్నాడు. తర్వాత నెమ్మదిగా 'అది సాధ్యంకాదు. నేనా మనిషిని కలుసుకోవడం జరగనిపని. ఇప్పుడు మీరు నా ముందున్నారు. పెద్దవారు. పెద్ద ఉద్యోగస్తులు. ఆ పుట్టుమచ్చ కోసం మీ చేతులు చూడనా? ఇలా ఎంతమందిని, ఎంతకాలం, ఎక్కడని పరీక్షచెయ్యను? లాభంలేదు. అది జరగనిపని...' అంటూ నిట్టూర్చాడు.

నేనలాగే కూర్చున్నాను. కదలకుండా రాతిబొమ్మలా కూర్చున్నాను. అతడంతలో లేచివెళ్ళి ఆ ఫోటో అందుకుని వచ్చి మళ్ళీ కుర్చీలో కూర్చున్నాడు. ఎందుకో ఒక్కసారి నవ్వాడు. తర్వాత నెమ్మదిగా ముందుకువంగి 'ఈ ఫోటోలో ఉన్న ముగ్గురిలో ఒకామె నా చెల్లెలు... ఇప్పుడు బతికున్నదో లేదో, బతికుంటే ఎక్కడున్నదో తెలీదు. నాకు తెలుసుకోవాలని కోరిక కూడా లేదు. (ఈ మాటలంటూ వుండగా అతని గొంతు బొంగురుపోయింది. అంతలో మళ్ళీ తమాయించుకున్నాడు) మిగిలిన యిద్దరూ దాని స్నేహితురాళ్ళు. పెద్ద స్నేహమేమీ కాదనుకోండి. కొన్ని నెలల స్నేహం. అంతే... ఇదుగో, చివర ఉన్న అమ్మాయి ఒక జడ్జిగారి కూతురు... ఇప్పుడో పెద్ద పోలీసాఫీసరు భార్య... ఆయన పేరు... ఏమిటబ్బా?... ఆఁ! వివేకానంద... ఆయన డీవైయస్పీ అనుకుంటాను. ఇప్పుడు గుంటూర్లో ఉంటున్నారు. వారికి ముత్యాల్లాంటి పిల్లలు... ఈ చివర ఉన్న అమ్మాయి పేరు నాకు తెల్సు... సావిత్రి...ఆమె పెళ్ళి చేసుకోలేదు. ఇప్పటికీ చేసుకోలేదు. గూడూరు హైస్కుల్లో టీచరు... ఇక మూడోది మా చెల్లెలు...' అంటూ గొంతు రుద్దుకుంటూ ఒక్క క్షణం ఆగాడు. తర్వాత సిగరెట్టు కిటికీలోంచి విసిరిపారేసి చేతి వ్రేళ్ళు విరుచుకుని, 'నాకు ఒక్కతే చెల్లెలు... బంగారపు బొమ్మ... పందొమ్మిదేళ్ళు గారాబంగా పెరిగింది... ముద్దుగా పెరిగింది... తర్వాత... తర్వాత... అంటూ ఆగి కణతలు నొక్కుకున్నాడు. అంతలో అకస్మాత్తుగా 'ఏమిటో - అనవసరమైన విషయాలూ మాట్లాడేస్తున్నాను. మీరేమీ అనుకోకండి...అన్నట్టు...మళ్ళీ ఒకసారి కాఫీ పుచ్చుకుంటారా?' అని అడిగాడు.

నేను 'వొద్దొద్దు - కాఫీ వొద్దు - చెప్పండి మీ చెల్లెలి కేమయింది?' అన్నాను. అతడు అదొకరకంగా నవ్వుతూ లేచి 'ఏమయిందని చెప్పను? చెబితే మీరు అసహ్యించుకుంటారు. అయినా చెబుతాను. మాచెల్లెలు వున్నట్టుండి ఒక్కనాడు తెల్లవారేసరికి ఇంట్లో కనిపించలేదు. ఒక చీటి వ్రాసి పెట్టి ఎక్కడికో వెళ్ళిపోయింది అంటూ అతడు బీరువా దగ్గరికి నడిచి అందులో ఏదో అరలో ఏదో పుస్తకంలో ఉంచిన చిన్న కాగితం తెచ్చి నాకు అందించాడు.

చాలా పాతకాగితం - ముడతలు పడిపోయి రెండు ముక్కలుగా ఊడిపోతున్నది. అందులో ఎక్కువగా చదువుకోని ఆడపిల్ల దస్తూరీ - బహుశా హడావిడిగా వొణుకుతున్న చేత్తో వ్రాసిన వ్రాత. నేను లోలోపల చదువుకున్నాను. పైన 'అన్నయ్యా!' అని సంబోధన ఉంది.

'నాకోసం వెతకవద్దు. నిర్భాగ్యురాలిని. మీ ముఖం చూడలేను. ఈ యింట్లో ఉండలేను. వెళ్ళిపోతున్నాను. ఎక్కడికో యింకా నిర్ణయించుకోలేదు.(ఇక్కడ ఏదో వ్రాసి కొట్టివేసివుంది) చచ్చిపోదలచుకోలేదు. అన్నయ్యా! మీ కెప్పుడైనా, ఎన్నేళ్ళకైనా, మోచేతి పైభాగన జీడిగింజంత పుట్టుమచ్చ వున్న వ్యక్తి కనిపిస్తే అతన్ని మీరు గుర్తిస్తే నేను చచ్చిపోయానని అబద్ధం చెప్పండి చాలు. ఈ మాటల మధ్యలో ఒక పేరు కొట్టేసి వుంది.'

ఇవే మాటలు ఆ వుత్తరం మీద కన్నీటి బొట్టు ఆరిన గుర్తులు - ప్రభాకరరావు మళ్ళీ ఆ చీటీ అందుకుని భద్రంగా అదే పుస్తకంలోదాచి, అదే అరలో పెట్టి బీరువా

తలుపు మూశాడు. తర్వాత నా ముందు కూర్చుని నుదురు రుద్దుకున్నాడు. అంతలో వాచీ చూసుకున్నాడు.

బయట వర్షం మొదలుకాలేదుగానీ అందుకు అంతా సిద్ధంగా వుంది. ఒక్కగాలి విసురు మళ్ళీతే చాలు, ఇక కుండపోతగా వర్షం మొదలయ్యేట్టున్నది.

నేను లేచాను. ప్రభాకరరావు తానుకూడా లేచి 'సరేనండి పొద్దుపోయింది. వర్షం కూడా వొచ్చేట్టుంది' అన్నాడు. తర్వాత నన్ను గుమ్మంవరకూ సాగనంపాడు. నేను చీకట్లో నెమ్మదిగా నడిచి యింటికి చేరుకున్నాను.

ఇప్పుడు - పక్కమీద నిద్రపట్టక దొర్లుతున్నాను. బయట వర్షం - కిటికీ రెక్కలమీద చప్పుడవుతున్నది. కిటికీలో ఆ పక్షి ఏదో యింకా కువకువ లాడుతున్నట్టే వున్నది. నేనులేచి కిటికీ తలుపులు తెరిచి చూశాను. జల్లు 'రివ్వ'న కొట్టింది. అక్కడ ఏ పక్షీలేదు. అంతానాభ్రమ.

మళ్ళీ పడుకున్నాను. నిద్రమాత్రలు నిండుకోవడం చాలా బాధ అనిపించింది. మనసంతా అల్లకల్లోలంగా ఉన్న సముద్రంలాగున్నది. బయట ఆకాశంలో ఉరుములు, మెరుపులు.... బలవంతంగా కళ్ళు మూసుకున్నాను. మగతగావుంది. మత్తుగావుంది. ఆ మత్తులో ఏవో తెరలు కదిలాయి... ఏవో దృశ్యాలు...

(చుట్టూ మంచు....దట్టంగా పొగమంచు....)

'ప్రియా!'

'ష్! ఏమిటా పిలవడం?'

'నీ పేరు ప్రియంవద కదామరి? ఇంకెలా పిలవాలి?'

'ఎవరైనా చూస్తారేమో!'

'మనం ఎవ్వరికీ కనిపించం... చూడు మనచుట్టూ మంచు ఎలా దట్టంగా పట్టిందో... సిల్కు తెరలు కట్టినట్టు...' గలగలమని నవ్వు...)

ఉలిక్కిపడి లేచాను. దాహమవుతున్నది. నెమ్మదిగా లేచి కూజా వంచుకుని గ్లాసెడునీళ్ళు గటగట తాగేశాను. మళ్ళీ కిటికీ పక్కన పక్షి కూస్తున్న సవ్వడి... ఇంకా భ్రమ...

గడియారం చూస్తే అర్ధరాత్రి దాటింది. నాకు నిద్ర రావడంలేదు. రాదు. సిగిరెట్ వెలిగించి కూర్చున్నాను. బయట వర్షంరొద... మళ్ళీ కొత్తయింటి వాసన... గోడలకు కొత్తగా కొట్టిన సున్నం వాసన.... అలాగే వెనక్కువాలి కళ్ళు మూసుకున్నాను.

కారులోపోతున్నాను. రోడ్డంతా గతుకులు ఒక రెండు ఫర్లాంగుల మేర రోడ్డుకటూ యిటూ సనాతన యోగులవలె నిలుచున్న చెట్లు... ఎండ లేదు. తేమ గాలి 'రివ్వ'న వీస్తున్నది.

కారు మరో అరగంట నడిచిన తర్వాత వర్షం మొదలైంది. పెద్ద వర్షం... ఇదేదో గాలివాన.... ఎక్కడో వాయుగుండం పడివుండాలి... లేకపోతే ఎడతెరిపి లేకుండా ఈ వర్షం ఏమిటి?

వైపర్లు 'టిక్‌టిక్'మని చప్పుడు చేస్తున్నాయి. పక్కన అద్దాలమీద నీటి చుక్కలు పడి వరుసగా క్రిందికి జారుతున్నాయి. వాటిలో రకరకాల దృశ్యాలు...

('ప్రియా!'

'మళ్ళీ అదే పిలుపు - వొద్దన్నానా?'

'ఇంకెలా పిలవను?'

'ఏమో, నాకు తెలీదుబాబూ! అదుగో, ఆ పిచ్చిపనులే వొద్దన్నాను. అంతలోనే కోపమా? ఇదుగో యిటుచూడండి... చక్కగా మాట్లాడరూ?'

'కొండమీద చూడు మబ్బులెలా వ్రేలాడుతున్నాయో!'

'మబ్బులు వ్రేలాడటం ఏమిటీ? గలగలమని నవ్వు...)

ఎదురుగా వీడెవడో లారీవాడు లైట్లతో వస్తున్నాడు. రోడ్డంతా జారుతున్నది. బురదబురదగా వుంది. రోడ్డు కటూయిటూ, నేల అంతా ఆకుపచ్చరంగు తివాచీ పరిచినట్టున్నది. కన్నులకింపుగావుంది. తడి తడిగా వుంది. మబ్బులు గుత్తులు గుత్తులుగా ఆకాశంలో వ్రేలాడుతున్నాయి. వర్షంలో తడిసిన ఈ పిట్ట ఏదో నెమ్మదిగా రెక్కలూపుకుంటు ఎగిరిపోతున్నది.

వైపర్లు వేగంగా పనిచేస్తున్నాయి. కారు అద్దాలమీద నీటి బిందువులు అవి యింకా అల్లిబిల్లిగా క్రిందికి జారుతున్నాయి. రోడ్డుపక్కన నిండుగా ఎర్రనిపూలు పూసిన ఈ చెట్టు పేరేమిటి? ఏమో, మనకు తెలియదు. ఎవరూ, ఎన్నడూ చెప్పలేదు - మళ్ళీ అద్దం మీద దృశ్యాలు-

('చినుకులు - పద పద - పరుగెత్తి మెట్లెక్కు -'

'ఇప్పుడీ వర్షం ఏమిటి?'

'అకాలంలో వర్షం - పెద్దదే - ఇప్పుడల్లా తగ్గేట్టులేదు - ఇదుగో, ఈ రుమాలు పెట్టి మొహం తుడుచుకో-

'ఈ రుమాలు మీద 'వి' అని వుందే'

'అది నాది కాదులే... విశ్వం అని ఒక స్నేహితుడిచ్చాడు'

"నేను 'బి' అనే అక్షరంతో చక్కగా కుట్టి ఒక రుమాలు మీకు యిస్తాను!'

'ఎప్పుడు?'

'రేపు... లేకపోతే ఎల్లుండి... 'బి' అనికాదు. మీ పూర్తిపేరు కుట్టి యిస్తాను... ఎర్రదారంతో అన్నట్టు ఎరుపు మీకిష్టమేనా? అలా వొద్దులెండి - మిమ్మల్ని అందరూ 'బిందు' అని పిలుస్తారన్నారుగా? బిందు అని కుట్టియిస్తాను ఏం?'

'మహా ప్రసాదం - నీ బంగారుచేతులతో యిస్తే -

'ఇష్ - అలా మాట్లాడకండి నాకేమిటోగా వుంటుంది'

'ఎలా ఉంటుంది చెప్పు...'

'అబ్బ ఉండండి...')

ఈ కారువాడెవడో నీళ్ళను చిందగొడుతూ వేగంగా దూసుకుపోతున్నాడు. ఎందుకంతవేగం? ఎక్కడేం కొంపలు కాలిపోతున్నాయో!

ఈ మబ్బులిక్కడ తెల్లతెల్లగా రెల్లుపూలతో పందిరి వేసినట్టున్నాయి. ఈ వర్షం యిప్పట్లో పూర్తిగా తగ్గేట్టులేదు.

♦ ♦ ♦ ♦ ♦ ♦

కొంచెం కష్టంమీద యిల్లు కనుక్కున్నాను. కారు వీధిలో ఆపి దిగి గేటు దాటుతూవుండగా నల్లని పులిలాటి కుక్క భయంకరంగా అరుచుకుంటూ మీదికి దూకింది. వర్షపు జోరు తగ్గింది... సన్నని తుంపరలు మాత్రం పడుతున్నాయి.

అంతలోనే 'ఏయ్! టామీ!' అన్న మందలింపు విని కుక్క అరవడం ఆపి అనుమానంగా నావంక చూస్తూ అక్కడే కూర్చుండిపోయింది. నేను వరండాలోకి చూశాను. ఆమె అక్కడే నిలబడి వుంది. మనిషి నిండుగా హుందాగా వుంది.

నేను మెట్లెక్కి వరండాలోకి వెళ్ళి ఏమీ మాట్లాడాలో తెలియక తటపటాయిస్తూ ఒక్క క్షణం నిలబడ్డాను.

ఆమె అంతలో 'ఎవరికోసమండీ? అలా కూర్చోండి' అన్నది.

నేనామె వంకచూసి నెమ్మదిగా, 'మీరేనా వివేకానందంగారి...' అంటూ ఆగిపోయాను.

'అవునండి. మీకు వారితో ఏమైనా పనివుందా?'

'వారితో కాదులెండి... మీతోనే పనివుంది' అంటూ కూర్చుని నుదురు తుడుచుకున్నాను.

ఆమె కళ్ళు పెద్దవిచేసి చూస్తూ 'ఏమిటది?' అని అడిగింది.

నేను నెమ్మదిగా 'నాకు ఒక మనిషి ఆచూకీ కావలసివచ్చి తిరుగుతున్నాను...'

'అయితే అది మావారిపనే....' అన్నదామె నవ్వుతూ.

'కాదండీ నన్ను చెప్పనివ్వండి... ఇది చాలా ఏళ్ళ క్రిందటి సంగతి... మీకు గుర్తుండి వుంటుంది. మీకు ప్రియంవద అనే స్నేహితురాలుండేది. ఆమె, మీరు, మరొక స్నేహితురాలు కలిసి ఫోటో కూడా తీయించుకున్నారు.'

ఆమె భ్రుకుటి ముడిపడింది. కొద్దిక్షణాలు ఆలోచనలో పడింది. తర్వాత తను కూడా కూర్చుని చూపుడువ్రేలు బుగ్గమీద ఆనించుకున్నది. ఉన్నట్టుండి... 'అవును... గుర్తున్నది... ప్రియంవద చక్కని అమ్మాయి... ఆమెకో అన్నగారుండేవారు. నేనెప్పుడూ ఆయన్ను చూళ్ళేదనుకోండి... మీరేనా ఏమిటి? అవును ఆ ఫోటో కూడా మా యింట్లో మొన్న మొన్నటిదాకా వుండాలి. చాలా పాతఫోటో – ట్రాన్సుఫర్లూ, ఇళ్ళు మారడాలూ, ఈ గొడవల్లో ఎక్కడ పోయిందో ఏమో! ఇప్పుడు కనిపించడం లేదు' అన్నది.

నేను నిట్టూర్చాను. 'మీరేనా ఆమె అన్నగారు?' అన్న ఆమె ప్రశ్నకు జవాబు చెప్పకుండా నెమ్మదిగా 'ఆమెను గురించే వెదుకుతున్నాను. ఆమె ఎక్కడ వుందో మీకు తెలిస్తే దయచేసి చెప్పండి – మీకు ఆజన్మాంతమూ...' అన్నాను.

"మీరు పెద్దవారు... అలా అనకూడదు. ఉన్న విషయం చెబుతున్నాను, ఆమెను అదే నేను చివరిసారిగా చూడటం, తర్వాత ఆమె ఎలావుందో ఎక్కడవుందో నాకసలు తెలీదు. కొన్నాళ్ళపాటు మా స్నేహం మాటి మాటికీ గుర్తువొస్తూ వుండేది. ఇప్పుడది కూడా లేదు. అయినా, ఆమెకేమయింది? ఎందుకు మీరిలా..."

నేను డీలా పడిపోయాను. కుర్చీలో వెనక్కువాలి అలసటగా ఒక్క క్షణం కళ్ళుమూసుకున్నాను.

ఆ తర్వాత లేచి 'వెళ్ళొస్తానండీ' అంటూ మెట్లు దిగుతున్నాను. ఆమె వెనకనుంచి 'కొంచెం కాఫీ తీసుకుపోదురుగాని, ఉండండి...' అంటున్నది. నేను వెను దిరిగి చూసి 'ఒద్దండీ... తొందరగాపోవాలి... చాలా దూరం పోవాలి' అన్నాను. ఆమె ఆమాట విని అదొక రకంగా చూసింది.

మరో అయిదు నిముషాలలో ఊరుదాటి రోడ్డు మీదికి వచ్చేసరికి చల్లనిగాలి 'రివ్వు'న వీస్తున్నది. ఆకాశం యింకా నీళ్ళ సంచీలాగే వుంది. అడవి పావురం మెడరంగులోవున్న మబ్బులు గుమిగూడి ఉన్నాయి. అవి ఉండి ఉండి గర్జిస్తూ, ఉరుముతూ వున్నాయి.

రోడ్డు ప్రక్కన ఒక చోట ఒక అమ్మాయి, ఒక అబ్బాయి... వారి వెంట ఒక ట్రంకు పెట్టె. దానిమీద యిద్దరూ సర్దుకుని కూర్చుని వున్నారు. నేను దూరం నుంచే కారువేగం తగ్గించాను. ఆ అబ్బాయి ఆశగా ఆదుర్దాగా లేచి నిలబడి చెయ్యి చాపాడు. కారు ఆపాను.

అతడు 'బస్సులు లేవండి... ప్లీజ్... పదిమైళ్ళు వెళ్ళాలి... పది గంటలకల్లా వెళ్ళకపోతే మా ఆఫీసరు మండిపడతాడు...' అన్నాడు ఆత్రుతగా...

ఆ అమ్మాయి కూడా లేచి నిలబడింది. నేను ఆ యిద్దరి వంకా మార్చి మార్చి చూశాను. తర్వాత వెనక తలుపు తీసి 'రండి' అన్నాను. ఇద్దరూ గబగబవచ్చి ఆ ట్రంకు పెట్టె లోపల పెట్టుకుని కూర్చున్నారు. కారు ముందుకు సాగింది.

నేను ఎదురుగా అద్దంలోకి చూస్తూ కారు నడుపుతున్నాను. ఆ అమ్మాయి ముచ్చటగా వుంది. అమాయకంగా వుంది. అందంగా వుంది. ఆ అబ్బాయి ముచ్చటగా వున్నాడు. అమాయకంగా వున్నాడు. 'ప్రపంచంలో అంతా మంచితప్ప మరేమీలేదు–' అని నమ్ముతున్న వాడిలా వున్నాడు. పది గంటలు దాటినతర్వాత ఆఫీసుకుపోతే అతని ఆఫీసరు మండిపడతాడట. టు హెల్ విత్ దట్ ఆఫీసర్!

అంతలో మళ్ళీ సన్నగా జల్లు మొదలైంది. అద్దంమీద నీటి బిందువులు జారుతున్నాయి. అంతలో మళ్ళీ నీడలు...

(ఏమండీ! మీరు మళ్ళీ ఎప్పుడొస్తారు"

'వారంలో... కాకపోతే పదిరోజుల్లో...'

'అమ్మో! అన్ని రోజులే...'

'తప్పకుండా వస్తానుగా... నా మాట నమ్ము...'

'మిమ్మల్నే నమ్మాను... అయినా యిప్పుడెందుకో భయంగా వుంది...'

'ఎందుకూ భయం?'

తర్వాత నిశ్శబ్దం... జలాశ్రయములై తళతళలాడే పెద్ద పెద్ద కళ్ళు...)

ఇక్కడ రోడ్డు కడ్డంగా పెద్ద చెట్టు పడిపోయి వుంది. ఎదురుగా వస్తున్న ఒక కారు డ్రయివరు చాలా జాగ్రత్తగా, నేర్పుగా నడుపుకుంటూ వచ్చాడు. నేను అంతసేపూ కారు ఆపి కూర్చున్నాను. వెనుదిరిగి ఆ అబ్బాయివంక చూశాను. అతని కళ్ళల్లో... భయం... అతని గుండెల్లో ఆ కర్కోటకుడైన ఆఫీసరు... 'భయం లేదు నాయనా! నిన్ను టైముకు మీ వూరు చేరుస్తాను. ఈ లోపల వర్షం రానీ, పిడుగులు పడనీ, చెట్లు

సమూలంగా కూలిపోనీ... నేను లెక్కచెయ్యను. నువ్వు హాయిగా, తీరికగా ఆఫీసుకు వెళ్ళవచ్చును' అనుకున్నాను. జాగ్రత్తగా, కూలి పోయిన చెట్టు తప్పించి కారు పోనిచ్చాను. అవతలి వైపుకు వెళ్ళగానే ఆ అబ్బాయి ముఖంలో అమ్మాయి ముఖంలో సంతోష రేఖలు చూశాను. కారు రివ్వున ముందుకు సాగింది. మళ్ళీ నా ఎదురుగా అద్దంలో దృశ్యం....

('ఏమండీ! మీ దండమీద ఈ పుట్టుమచ్చ ఎంత బావుందో!'

'పుట్టుమచ్చ బాగుండటం ఏమిటి?'

'మీకేం తెలుసు? అది గొప్ప అదృష్టం...')

అంతలోనే పై పంచెతో నుదురు తుడుచుకుని వేగం హెచ్చించాను. మరో అయిదారు నిముషాలలోనే ఆ అబ్బాయి 'వొచ్చేశాం సర్! ఆపండి....' అన్నాడు. కారు పక్కకు తీసి ఆపాను. వాళ్ళిద్దరూ దిగారు. అతడు ట్రంకు పెట్టె చేత్తో పట్టుకుని 'చాలా థ్యాంక్స్ సార్... గొప్ప మేలు చేశారు'... అన్నాడు.

నేనేమీ మాట్లాడలేదు. బహుశా పేలవంగా నవ్వి వుంటాను. తల ఊపి వుంటాను.

◆ ◆ ◆ ◆ ◆ ◆

ఇంకా... ఇంతదూరం వచ్చినా, ఇన్ని గంటలు ప్రయాణం చేసినా, వర్షం... వర్షం.... ఈ మబ్బులు నా నెత్తిమీదే, నాతోపాటే ప్రయాణం చేస్తున్నట్టున్నాయి.

ఊరంతా అసహ్యంగా వుంది. ఊళ్ళో రోడ్లన్నీ బురదగా అసహ్యంగా వున్నాయి. రోడ్లమీద మట్టి అంతా వర్షానికి కొట్టుకుపోయి మొనదేలిన రాళ్ళు పైకి తేలి వున్నాయి. సాయంకాలం నాలుగున్నరే అయినా చీకటి పడుతున్నట్టుగా వుంది. వారినీ వీరినీ అడుగుతూ హైస్కూలు చేరుకున్నాను.

ఎర్రని కొండరాళ్ళతో కట్టిన ప్రహరీ... లోపల విశాలమైన ఆవరణ... ఆవరణలో నిద్రగన్నేరు చెట్టు...

కారులోనుంచి దిగగానే ముందుకు తూలాను. ఇన్నేళ్ళుగా ఉపయోగించిన మందులూ, నిద్ర మాత్రలూ, ఇప్పుడు పనిచేస్తున్నట్టున్నాయి. ముసలివాడినై పోతున్నట్టున్నాను. ఇక ఇలాటి సందర్భాలలో ఉపయోగించుకునేందుకు ఒక దిట్టమైన చేతికర్ర కొనుక్కోవడం మంచిది...

లోపల చెట్ల క్రింద పిల్లలు... రంగు రంగుల పూల వలె అమాయకంగా, స్వచ్ఛంగా వున్న పిల్లలు... నేను వరండాలో నెమ్మదిగా నడిచివెళ్ళి హెడ్మాస్టరు రూముముందు కూర్చునివున్న బంట్రోతును వివరం అడిగాను. వాడు ఒక్కక్షణం ఆగి 'సావిత్రమ్మగారా? అదుగో, ఎదురుగా పాక వుందే... అందులో వుంటారు' అన్నాడు.

నా గుండెలు ఒక్క క్షణం దడదడలాడాయి. నుదుట చెమట పడుతూ వుంటే తుడుచుకుని నిద్ర గన్నేరు చెట్టు క్రింద కొద్ది క్షణాలు నిలబడ్డాను. గాలి విసిరినప్పుడల్లా ఆకులమీద నిలిచివున్న నీటి బిందువులు 'టపటప'మని పైనుంచి పడుతున్నాయి. తల ఎత్తి పైకి చూశాను. మెత్తని పూలు కొన్ని ఉన్నాయి.

('అబ్బ! భలేవారండీ మీరు! ఆ కొమ్మ వూపారా? మళ్ళీ వాన మొదలైందనుకున్నాను.'

'వాన వస్తే ఏం? హాయిగా ఇక్కడే కూర్చుండి పోవచ్చు...'

'మీకేం? ఎన్నయినా చెబుతారు. ఇంటికి పెందరాళే వెళ్ళకపోతే మా అన్నయ్య...'

'మీ అన్నయ్య పేరేమిటి? మంచివాడు కాదా?'

'ప్రభాకరరావు... నాకు మా అన్నయ్యను చూస్తే భయమూ, భక్తీ రెండూనూ... ఎంతెంత పెద్ద పుస్తకాలు చదువుతాడనీ...'

'ఇదుగో, ఈ పువ్వు చూడు. ఎంత మృదువుగా వుందో...'

గలగలమని నవ్వు...

'సరే సంబడం... నిద్రగన్నేరు పువ్వు మృదువుగా ఉండక కంకర రాయిలా వుంటుందా మరి?')

"ఏమండీ! సావిత్రమ్మగారెవరు?"

అక్కడ కూర్చుని మాట్లాడుకుంటున్న నలుగురూ నా ప్రశ్న విని నావంక తిరిగి చూశారు. ఒకామె లేచింది. ఆమెకు నలభై అయిదేళ్ళుండవచ్చు... నల్లని చీరె కట్టుకుని తెల్లని జాకెట్టు వేసుకుని వుంది. చాలా మంచిగా, నమ్రతగా వుంది. తలలో పూలు వున్నాయో లేదో నేను గమనించలేదు.

ఆమె 'నేనేనండి... ఏంకావాలి మీకు? ఎవరు మీరు?' అని అడిగింది.

నేను సందేహిస్తూ 'మీతో ఒక్క నిముషం మాట్లాడాలి...' అన్నాను.

ఆమె కళ్లు పెద్దవి చేసుకుని ఒక్కక్షణం నా వంక చూసింది...తర్వాత ఏమనుకున్నదో ఏమో, మిగిలిన వారితో 'ఇప్పుడే వస్తాను... ఉండండర్రా...' అని చెప్పి ఇవతలికి వచ్చింది.

ఇద్దరం పది అడుగులు వేసి మరొక రూముకు వచ్చాము. అక్కడెవరూ లేరు. ఆమె 'కూర్చోండి... చెప్పండి...' అన్నది.

నేను నుదురు రుద్దుకుంటూ కూర్చున్నాను. రెండుసార్లు గొంతు సర్దుకుంటే గానీ మాట వెలికి రాలేదు. 'నేను... నేను చాలా దూరంనుంచి వస్తున్నాను. చాలా ఆశతో వస్తున్నాను. మీవల్ల ఒక వ్యక్తి వివరం తెలుస్తుందన్న ఆశతో... మీకు తెలిస్తే తప్పక చెబుతానని మాట యివ్వండి...' అన్నాను.

ఆమె ఆశ్చర్యంగా చూసి 'మీరెవరో నాకు తెలీదు. వయసుకు పెద్దవారు కాబట్టి... ఏదో ఆదుర్దాగా కనిపిస్తున్నారు కాబట్టి, అలాగే.... నాకు తెలిసిన వివరమైతే తప్పక చెబుతాను' అన్నది.

నేను నెమ్మదిగా 'చాలా యేళ్ళ క్రిందటి సంగతి... మీకు ప్రియంవద అనే స్నేహితురాలుండేది. మీరు కొన్ని నెలలు మాత్రం స్నేహంగా వున్నారు. మీరు ముగ్గురు... ఒకామె యిప్పుడు గుంటూర్లో వుంటున్నారు... ఆమె పేరు నాకు తెలీదు. పోలీసాఫీసరు భార్య... అంటున్నాను.

ఆమె అకస్మాత్తుగా 'అవును... లక్ష్మి...' అన్నది. తర్వాత ఆమె చూపులు నా మీదనే నిలిచాయి. ఉన్నట్టుండి 'ప్రియంవద... గుర్తులేకేం... నిక్షేపంగా గుర్తున్నది... అది సరే. అసలు విషయం చెప్పండి'...అన్నది మళ్ళీ...

నాకు విపరీతమైన దాహం వేస్తున్నది... నాలికతో పెదవులు తడుపుకుని 'అవును. ప్రియంవద... ఆమెను గురించిన వివరంకావాలి... గంపెడాశతో వచ్చాను. దాచక చెప్పండి...' అన్నాను.

'వివరం అంటే?' అని ఆమె రెట్టించింది.

నా గుండెలు దడదడ కొట్టుకుంటున్నాయి. మెల్లిగా 'అంటే... ఆమె ఎక్కడ ఉందో, ఎలా వుందో చెప్పండి- దయచేసి' అన్నాను. నా గొంతు రుద్ధమైపోయింది.

ఆమె చిత్రంగా చూసింది. అంతలోనే 'మీరెవరు' అని అడిగింది. ఆమె చూపులు వాడిగా ఉన్నాయి.

నేను తల దించుకున్నాను. 'నా పేరు విశ్వేశ్వరరావు –' అన్నాను.

ఆమె అకస్మాత్తుగా 'మీరెవరైతే నాకెందుకు? ఆమెను గురించి ఆరాటపడదగిన వాళ్ళిద్దరే ఉన్నారు. మొదటివారు ఆమె అన్నగారు. ఆయన పేరు నాకు తెలీదు. నేనాయను నెప్పుడూ చూడలేదు. రెండు వ్యక్తి ఒక మోసగాడు - పచ్చి మోసగాడు - అతని అసలు పేరు ప్రియంవదకు కూడా తెలీదనుకుంటాను. ఆ యిద్దరిలో మీరెవరైనా నాకు పట్టింపు లేదు.' అంటూ ఒక్క క్షణం ఆగి 'మీరామెను చూడాలని నిజంగా అనుకుంటున్నారా?' అని అడిగింది.

'నిజంగా చూడాలి అది చాలా ముఖ్యం.'

'అలా అయితే మీరు ధైర్యం కూడగట్టుకోవాలి... ఆమె...'

నేను తడబడుతూ లేచాను. 'కూర్చోండి' అన్నదామె. మళ్ళీ కూలబడ్డాను.

'ఒక వేళ చచ్చిపోయిందని చెబుతానేమోనని మీరు భయ పడ్డట్టున్నారు. లేదు లెండి... బ్రతికే వుంది. కాని మీలో ఆమెను చూడగల ధైర్యం ఉందా! ఆమె కొకవేళ ఏ కుష్టు వ్యాధిలాంటి భయంకర రోగమో అనుకోండి... మీరు వెళ్ళి చూడగలరా?'

నా ప్రాణాలు విలవిల కొట్టుకున్నాయి. 'అమ్మా! నాకంటె చిన్నదానివి- అయినా, నీకు దణ్ణం పెడతాను. నన్ను పరీక్షించకు. కాని - కాని ఎట్టి పరిస్థితిలోనూ నేనామెను చూడాలి - చూసి తీరాలి –' అన్నాను. నా గొంతు వొణికింది.

ఆమె నవ్వింది. 'సరే - అలాగే చూద్దురుగాని - కాని కొంచెం ఆగండి. ఇప్పుడే వెడితే మీరామెను చూడలేరు. రాత్రి తొమ్మిదిగంటల లోపుగా వెళ్ళకండి- ఎలా వెళ్ళాలో చెబుతాను వినండి' అన్నది.

ఆమె చెప్పినదంతా అతి జాగ్రత్తగా విన్నాను. మళ్ళీ మళ్ళీ అడిగి చెప్పించుకున్నాను. తర్వాత లేచాను. నా కళ్ళ వెంట ఎందుకో నీటి పొరలు కమ్ముతున్నాయి. గుండె గొంతుకలో కొట్లాడుతున్నది. విపరీతమైన దాహం - ఆకలి ఎప్పుడో చచ్చిపోయింది.

ఆమె నేను వెడుతూ వుండగా చిత్రంగా నవ్వింది. తర్వాత 'గుర్తుందిగా? తొమ్మిది గంటలకు గాని ఆ గుమ్మం ఎక్కవద్దు –' అన్నది.

నేను తల వూపి త్వరత్వరగా వచ్చేశాను. స్కూలు గేటు ఎదురుగా ఆగి వెనుదిరిగి చూశాను. ఆమె యింకా అక్కడే నిలబడి నావంకనే చూస్తూ వుండటం గమనించాను. తర్వాత వడివడిగా వెళ్ళి పక్క కొట్లో సోడా తీసుకుని తాగాను.

అంతలో బెల్లు మ్రోగింది. బిలబిలలాడుతూ పిల్లలందరూ బయటికి వచ్చేస్తున్నారు. కొద్ది నిముషాలలోనే అందరూ వెళ్ళిపోయారు. తర్వాత అంతటా నిశ్శబ్దం.

నేను కారు ఖాళీ స్థలంలో ఆపి కూర్చున్నాను. పొద్దుగూకుతున్నది. నిద్రగన్నేరు చెట్టుమీద పక్షులు అసంఖ్యాకంగా చేరి రొద చేస్తున్నాయి. అంతలో మళ్ళీ సన్నగా జల్లు మొదలైంది.

కాలం - చుట్టలు చుట్టుకుని పడుకున్న పెద్ద కొండ చిలువ వలె నెమ్మదిగా కదులుతున్నది. నా జీవితమంతా కాలం నెమ్మదిగా, నీరసంగా, నిరానందంగానే గడిచింది. గడియారం ముళ్ళు ఎంతకూ కదలడంలేదు. సిగరెట్లు మసి అవుతున్నాయి.

ఇప్పుడు నిజంగా చీకటి పడింది. జల్లులో తడుస్తూ కొందరు మనుషులు త్వరత్వరగా వెళ్ళిపోతున్నారు. కీచురాళ్ళ చప్పుడు నిర్విరామంగా వినిపిస్తున్నది. ఈ కీచురాళ్ళనేవి ఎలా ఉంటాయి? ఎక్కడ ఉంటాయి? ఏమో, నాకింత వరకూ తెలీదు.

తొమ్మిది గంటలు - శరీరంలో విచిత్రమైన ఉత్సాహం బయలుదేరింది. నరాల్లో రక్తం జివ్వున పరుగులు తీసింది. కారు దిగి అద్దాలు పైకెత్తి తలుపులన్నీ వేసేశాను. తాళం చెవులగుత్తి లాల్చీ జేబులో వేసుకుని ముందుకు నడిచాను.

అన్నీ మురికి వీధులు... లైట్లు అక్కడక్కడ మందంగా వెలుగుతున్నాయి. అదుగో... అదే ఆమె చెప్పిన మేడ... మేడ ఎదురుగా వీధి. ఆ వీధిలో బాగా ముందుకు పోవాలి... ఇదే నాలుగు చిన్న రోడ్లు కలిసే చోటు... ఇదే ఆమె చెప్పిన వీధి అరుగు గుర్తు...

కొద్ది గజాల దూరంలో కొన్ని క్షణాలు నిలబడ్డాను. గుండెల నిండుగా గాలి పీల్చుకున్నాను. ఆ యింటిముందు అరుగుమీద నలుగురో, అయిదుగురో మనుషులు కూర్చుని వున్నారు. ఒక గళ్ళ లుంగీవాడు పెద్ద వస్తాదులా వున్నాడు... అక్కడ గోడకానుకుని నిలబడి వున్నాడు.

నేను నెమ్మదిగా నడిచివెళ్ళి అక్కడ నిలబడ్డాను. ఆ మనుషులందరూ నావంక చూశారు. నేనేదో అడగబోయేలోగా ఆ గళ్ళలుంగీ వాడు ఒక్క అడుగు ముందుకు వేసి 'రండి స్వామీ' అని తర్వాత 'అరే చిన్నయ్యా!' అయ్యగార్ని లోపలికి తీసుకుపో...' అన్నాడు.

ఆ చిన్నయ్య అనబడేవాడు అక్కడే వున్నాడు. కుర్రవాడు... 'ఇటురండి సార్!' అంటూ నన్ను మెట్లెక్కించి లోపలికి తీసుకువెళ్ళాడు. నేనేమీ ఆలోచించకుండా లోపలికి నడిచాను. సన్నటి దారి... లోపలి గదిలో కూర్చోబెట్టి నేను నోరెత్తే లోపుగా ఏమీ వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు. నేను అటూ యిటూ చూస్తూ కుర్చీలో కూర్చుండిపోయాను. గది గోడలకు లేత ఆకుపచ్చ రంగు. గుమ్మాలకు అదే రంగు తెరలు.... పక్కన ఒక అలమారు... ఒక మంచం...

ఎన్నో క్షణాలు గడవలేదు. ఆ గదిలోకి ముగ్గురు అమ్మాయిలు వచ్చారు. ఒకరి ప్రక్కనే ఒకరు నిలబడ్డారు. ఎవరికీ పాతికేళ్ళకు మించి వయసుండదు. పలుచని చీరెలు కుట్టుకుని వున్నారు. లోపల బాడీలు కనిపించేలా జాకెట్లు వేసుకుని వున్నారు. తాంబూలంతో వారి నోళ్ళు ఎర్రగా పండి వున్నాయి. అందరికీ తలలో పూలున్నాయి.

నే నప్పుడు ఏదో స్ఫురించి అదిరిపడ్డాను. వారు ఒకరి వంక ఒకరు చూసుకున్నారు ఏమనుకున్నారో ఏమో, వెళ్ళిపోయారు.

అంతలో పక్క గుమ్మం తెర తొలగించుకుని ఒకామె వచ్చింది. నేను ఉలికిపడి ఆమెవంక చూశాను. ఆమె జుట్టు రేగి వుంది. చాలా సాదా చీరె కట్టుకుని వుంది. చీరెకొంగు మెలితిప్పి మెడచుట్టూ చుట్టుకుని వుంది.

నాలో చలనం లేదు. శిలా ప్రతిమలా కూర్చుండిపోయాను. గుండె మాత్రం దడదడ కొట్టుకుంటున్నది. గుండెలో ఏ మూలనో కొద్దిగా నొప్పి....

ఆమె అక్కడే నిలబడి మాట్లాడింది. "ఏం బాబుగారూ! పెద్ద వారు. ఏదో సరదాకొద్దీ వొచ్చివుంటారు. ఈ ముగ్గురిలో ఎవరూ నచ్చలేదా?'

నా నోట మాట రాలేదు. మాటిమాటికీ నుదట పడుతున్న చెమటను తుడుచుకుంటూ అలాగే కూర్చుండిపోయాను. నా గుండె మాత్రం 'అయ్యో? ప్రియంవదా! నీ బంగారు రంగు ఏమైపోయింది? నీ అందాల చిరునవ్వు ఏమైపోయింది? రక్తాన్ని పరుగులెత్తించే నీ శరీర లావణ్యం ఎక్కడికి పోయింది? అసలు నువ్విక్కడ, ఇలా, ఎందుకున్నావు?' అని కొట్టుకుంటూనే వుంది.

ఆమె ఒక్క అడుగు ముందుకు వేసి 'పోనీ, ఇంకో అమ్మాయి వుంది. చూస్తారా? నా కూతురే... కాకపోతే కొంచెం డబ్బు...' అంటూ ఆగి 'అమ్మాయ్! రేవతీ! ఇలారా అమ్మా' అని కేక వేసింది.

నా కళ్ళు తెరుచుకునే ఉండిపోయాయి. గుండెలు దడదడ కొట్టుకుంటూనే వున్నాయి. ఇప్పుడు నేను లేవగలనా? లేచి పడిపోకుండా నడవగలనా? చేతి కర్ర కూడా లేదే...

మరుక్షణంలో గుమ్మంలో ఆ అమ్మాయి కనిపించింది. ఇరవై అయిదేళ్ళ వయసుంటుంది. తాంబూల చర్వణంతో పండిన క్రింది పెదవిని పంటితో నొక్కి పెట్టి నా వంకనే చూస్తున్నది.

నేను చివాలున లేచాను. వేదన, ఇక ఈ వేదన భరించలేను. చుట్టూ కమ్ముకుని వస్తున్న మంటల మధ్య నిలబడ్డట్టున్నది. ఇక్కడ మరో క్షణం ఉంటే ఏం మాట్లాడుతానో, ఏం చేస్తానో, ఏమైపోతానో తెలీదు. పెద్ద పెద్ద అంగలు వేస్తూ ఆ సన్నటి సందులోనుంచి నడిచి యివతలికి వచ్చాను. గబగబ మెట్లుదిగి దెబ్బతిన్న పాములా పరుగు వంటి నడక ప్రారంభించాను.

గాలి... చుట్టూ చల్లని తేమగాని... అయినా శరీరమంతటా చెమట పోస్తున్నది. వొళ్ళు కొంచెం తూలుతున్నది. మళ్ళీ విపరీతమైన దాహం...

కారు స్టార్టు చేసి ముందుకు దూకించాను. రెండు నిముషాలలో వూరి బయటికి వచ్చి మెయిన్‌రోడ్డు ఎక్కాను. తర్వాత వేగం మరింత హెచ్చించాను. కార్లూ లారీలూ 'స్రు స్రు'న దూసుకుపోతున్నాయి. వాటి హెడ్ లైట్లు నా చూపులను చెదరగొడుతున్నాయి. అయినా నేను వేగం తగ్గించలేదు.

ఎంతసేపు కారు నడిపానో తెలీదు. మెయిన్ రోడ్డు పక్కన ఒక సన్నటి మట్టిరోడ్డు చీలి ఎటో పోతున్నది. అంతటా కనుచూపు మేర కటిక చీకటి. ఆ రోడ్డు వెంట ఒక యాభై గజాలు కారు నడిపి ఒక చెట్టు క్రింద ఆపాను. తర్వాత ఊరికే కూర్చుండిపోయాను. ఆ చుట్టు పక్కల ఎక్కడినుంచో ఏదో పూల వాసన... అడివి పూల వాసన... ఇది అంతా అడివేనేమో!

నేను కుడిచేత్తో ఎడమ మోచేతి పై భాగాన రుద్దుకుంటూ కూర్చుండి పోయాను. అక్కడ... ఆ అసహ్యకరమైన పుట్టుమచ్చ చేతికి తగులుతున్నది. అది ఎలా రూపుమాసి

పోతుంది? కాల్చుకుంటే పోతుందా? పదునైన చాకుతో అంతవరకు కోసేసుకుంటే పోతుందా? లేక ఏదయినా యాసిడ్...

అంతలో ఎదురుగా ఒక ముసలమ్మ నెత్తిమీద కుండతో రావడం కనిపించింది. ఆ కుండలో నీళ్ళున్నాయేమో! ఆ ముసలమ్మ దగ్గరికి రాగానే 'కాసిని నీళ్ళు పోస్తావా అవ్వా?' అని అడిగాను.

ఆమె ఆగి 'ఇది కల్లు బాబూ, తీపికల్లు.' అన్నది.

నేను ఉన్నట్టుండి 'ఉండు నాక్కావాలి' అన్నాను.

ఆమె ఒక గ్లాసు తీసి 'ఇది ఇరవై పైసలు... అంటున్నది.

నేను మరేమీ మాట్లాడకుండా ఆమె కుండలోనుంచి ముంచి అందిస్తూ వుండగా తాగాను. అయిదారు గ్లాసులు తాగాను. తర్వాత లాల్చీ జేబులో నుంచి రూపాయి నోట్లు మూడో నాలుగో తీసి యిచ్చి వెళ్ళమన్నాను. ఆమె కుండ నెత్తి కెత్తుకొని వెళ్ళిపోయింది.

అంతలో మళ్ళీ వర్షం మొదలయింది. ఈసారి పెద్ద వర్షం... రాళ్ళతో కొట్టినట్టు పెద్ద పెద్ద చినుకులు. ఆకాశం భయంకరంగా ఉరుముతున్నది... గర్జిస్తున్నది.

నేను వెనక్కు వాలి కళ్ళు మూసుకున్నాను. అంతలోనే నాకు నిద్రపట్టింది. నిద్ర పట్టగానే కల మొదలు... కలలో మనుషులూ, ఏ యితర ప్రాణులూ కనిపించలేదు. అంతటా మంచు... దట్టంగా పట్టిన పొగమంచు... ఆ పొగమంచు తెరలలో ఎవరిదో ముఖం... అస్పష్టంగా వుంది. ఎవరిదో తెలియడం లేదు... కరిగిపోయే మంచు మాత్రం చివరి వరకూ మిగిలింది.

♦ ♦ ♦